# రజ్జు సర్పభ్రాంతి

– కె. జయప్రద

రాత్రి ఎనిమిదిన్నర అయింది. పార్వతి వంట గది సర్దుతోంది. పార్వతి భర్త రామ్మూర్తి పడక కుర్చీలో తీరుబడిగా కూర్చుని నవల చదువుకుంటున్నాడు. పార్వతి కొడుకు నాని 10 ఏళ్ళవాడు. 5వ క్లాసు చదువుతున్నాడు. వాడు పుస్తకం ముందేసుకుని కునికిపాట్లు పడుతున్నాడు. వంట గది కడుగుతున్న పార్వతి ఇది గమనించి "ఒరే నానీ! చదివింది చాలు గాని ఇంక పడుకో. ప్రొద్దున్నే లేచి చదువుకుందుగానిలే," అంది.

తక్షణం నాని పుస్తకం మూసేసి లేచి అవతల గదిలోకి పోయి పడుకున్నాడు. పార్వతి వంట గది కడగడం ముగించి తలుపులన్నీ సరిగ్గా వేసి ఇవతలకి వచ్చి మరో కుర్చీలో కూర్చుని ఆ రోజే వచ్చిన పత్రిక సీరియల్ చదువుతోంది. ఇంతలోకే నాని "అమ్మా" అంటూ పరుగెత్తు కొచ్చి పార్వతిని భయంగా వాటేసుకొన్నాడు.

"ఏమిట్రా, ఏమైంది?" అంది పార్వతి కొడుకు మొహం కేసి చూస్తూ.

"గదిలో ఏదో నీడ తిరుగుతూందే" అన్నాడు వాడు ఏడుపు మొహం పెట్టి.

"నీ మొహం వెర్రి వెధవా. నీడ తిరగడమేమిటి?" అంది విసుక్కుంటూ. "పగలంతా అడ్డమైన చోట్ల తిరగడం రాత్రయ్యేసరికి భయమనడం! నోరు మూసుకుని పోయి పడుకో." అంటూ కసిరాడు రామ్మూర్తి. నానిగాడు బిక్క మొహంతో తిరిగి గదిలోకి పోయాడు.

మరో ఐదునిముషాలైనా గడవకుండానే గదిలోంచి "కెవ్వు" మంటూ నాని అరిచిన అరుపుకి చప్పున లేచి పరుగెత్తారు పార్వతి, రామ్మూర్తి. గదిలో నాని పక్కమీంచి లేచి కూచుని భయంతో వణికిపోతున్నాడు. ఒక్క అంగలో పార్వతి కొడుకుని సమీపించి "ఏమిట్రా నానీ, ఏమయిందీ" అంటూ కొడుకుని కంగారుగా దగ్గరకి తీసుకొంది.

రామ్మూర్తి వెళ్ళి ట్యూబ్‌లైటు స్విచ్ వేశాడు. "నానీ ఏమయింది? ఇటు చూడు" అన్నాడు కొడుకుని గట్టిగా కుదుపుతూ. వాడు ఒక్కసారి తెలివి వచ్చినట్లు తండ్రికేసి చూసి బావురుమని ఏడుస్తూ తండ్రిని చుట్టుకుపోయాడు. "ఏమిటి నాన్నా ఏమయింది?" అన్నాడు రామ్మూర్తి కొడుకుని బుజ్జగిస్తూ.

"నీడ నాన్నా! చుట్టూ తిరిగి మీదకొస్తోంది" అన్నాడు వాడు బెక్కుతూ. పార్వతి భయంగా రామ్మూర్తి దగ్గరగా వచ్చి నిలబడింది. రామ్మూర్తి పరీక్షగా గది అంతా కలియ చూసాడు. అతనికి ఏమీ కనపడలేదు, కొడుకు దేన్నో చూసి దడుసుకుని వుంటాడనుకుని "సరేలే; భయపడకు; నేనూ నీ దగ్గరే పడుకుంటానులే." అంటూ నెమ్మదిగా కొడుకుని పక్కమీద పడుకోబెట్టి వాడి పక్కనే తనూ పడుకుంటూ "పార్వతీ! నువ్వెళ్ళి తలుపులన్నీ జాగర్తగా వేసి లైట్లు ఆర్పేసి రా!" అన్నాడు. పార్వతి భయం భయంగా అక్కడ్నుంచి కదిలింది.

నెమ్మదిగా నిద్రలోకి జారుకొంటున్న రామ్మూర్తి, పార్వతి, నాని వేసిన కేకతో మళ్ళీ తుళ్ళిపడి లేచారు. నాని లేచి కూచుని వణుకుతున్నాడు. చెమటలు పట్టి వాడు వేసుకొన్న చొక్కా తడుస్తోంది. వాడి చూపుల నిండా బెరుకు. భయంగా గోడకేసి చూస్తున్నాడు. రామ్మూర్తి కూడా చప్పున గోడకేసి చూసాడు. నాని చెప్పినట్లు అక్కడొక నీడ ఉంది. అయితే అది పెద్ద పురుగు ఆకారంలో ఉంది. గదంతా తిరుగుతోంది. ఆ నీడని చూసాక పార్వతి తేలిగ్గా నిట్టూర్చింది. అంత వరకూ వాడికి దెయ్యమో, భూతమో కన్పిస్తోందనుకొని హడిలిపోయింది.

"ఏదో పెద్ద పురుగు అయ్యుంటుందండీ! లైటు వేసి బయటకి తోలెయ్యండి" అంది భర్తతో. రామ్మూర్తి లేచి వెళ్ళి ట్యూబ్‌లైటు వేసి పురుగు కోసం వెదికాడు. ఎక్కడా కనపడలేదు. "ఎక్కడో ఉండి ఉంటుంది. కాసేపాగితే అదే బయటికి వస్తుంది." అంది పార్వతి. కొంత సేపు చూసాక ఎక్కడా కనపడలేదు. విసుగ్గా లైటు ఆర్పేసి పడుకున్నాడు. "నానీ; నీకేం భయం లేదు. అటు పక్క నాన్నగారు, ఇటు పక్క నేనూ ఉన్నాం. ధైర్యంగా పడుకో" అంది కొడుకుని దగ్గరగా తీసుకొంటూ. నాని ఏమీ మాట్లాడకుండా బల్లిలా తల్లిని కరిచి పెట్టుకుని పడుకొన్నాడు.

మరో పదినిముషాలు గడిచాయి. పార్వతి నెమ్మదిగా రామ్మూర్తి చేతిమీద తట్టి "అదిగోనండీ. మళ్ళీ వచ్చింది పురుగు నీడ" అంది రహస్యం చెపుతున్నట్లు. రామ్మూర్తి నెమ్మదిగా లేచి కూర్చుని పరీక్షగా చూసాడు. గదిలో వలయాలుగా తిరుగుతోంది నీడ. ఒక్కొక్క సారి పైకప్పు మీద ఒకొక్క సారి నేలమీద కూడా పడుతోంది నీడ. రామ్మూర్తి కళ్ళు చిట్లించి పరీక్షగా చూసాడు. అతనికి కొంచెం ఆశ్చరమనిపించింది. నీడ కనిపిస్తోంది కాని పురుగు కనిపించదేమిటి? కిటికీ లోంచి బయటికి పోయిందేమో అనుకొందామంటే పార్వతి రోజూ 7 గం॥కి పక్కలు వేసేటప్పుడే కిటికీ తలుపులు కూడా మూసేస్తుంది. అందుకని కిటికీలోంచి పోయిందనుకో డానికి లేదు. ఏ తలుపు సందులోనైనా ఉందేమో నన్న అనుమానంతో ట్యూబ్ లైటు వేసి తలుపుల వెనకాల జాగ్రత్తగా వెదికాడు. ఎక్కడా ఏమీ కనపడలేదు. "ఒకవేళ దోమేమోనండీ" అంది పార్వతి సందేహంగా. "నీ మొహం" దోమ అయితే అంత పెద్ద నీడ పడదు. ఆ నీడ దగ్గిర దగ్గిర చిన్న సైజు గబ్బిలమంత వుంది." అన్నాడు రామ్మూర్తి చిరాకుగా. అతనికి నిద్ర ముంచుకు వస్తోంది. హాయిగా పడుకొందుకు లేకుండా ఈ నీడ గొడవ ఒకటి వచ్చి పడింది.

"అయితే సీతాకోక చిలక అయ్యుంటుంది" అంది పార్వతి.

"సీతాకోకచిలుకో, రామచిలుకో, అసలు ఏదో ఒకటి కంటికి కనిపించాలిగా" అన్నాడు రామ్మూర్తి విసుగ్గా. ఆమాట నిజమే ననిపించింది పార్వతికి. దానితో మళ్ళీ భయం ప్రవేశించింది ఆమెలో. తను కూడా లేచి తలుపుల వెనకాల, పెట్టెల వెనకాల మంచాల క్రింద జాగ్రత్తగా చూసింది. ఏమీ కనపడక పోయేసరికి పార్వతికి కూడా కొంచెం ఆశ్చర్య మనిపించింది. అయితే ఆ నీడ



ఏమై వుంటుంది.? అని ఆలోచనలో పడ్డారు పార్వతి, రామ్మూర్తి.

చిత్రంగా ట్యూబ్‌లైటు వెలుగు వున్నంతసేపూ కనపడ్డం లేదు పీడ. బెడ్‌రూము లైటులోనే కనిపిస్తోంది. ఏం చెయ్యాలో తోచక మళ్ళీ లైటు ఆర్పి పడుకున్నారు ఇద్దరూ. ఐదు నిముషాలు గడవకుండానే మళ్ళీ మొదలయింది పీడ తిరగడం. పార్వతి మనసులో ఆందోళన మొదలయింది. పక్కన పడుకున్న బాబుమీద చెయ్యేసింది, వేడిగా తగిలింది వాడి వళ్ళు. "ఏమండీ; చూడండి వీడి ఒళ్ళు ఎలా కాలిపోతుందో" అంది కంగారుగా రామ్మూర్తితో. రామ్మూర్తి కూడా నాని వంటి మీద చెయ్యేసి చూసాడు. వేడిగా కాలుతోంది ఒళ్ళు. రామ్మూర్తికి కూడా కంగారనిపించింది. గదిలో పీడ ఆగకుండా తెగ తిరుగుతోంది. వలయాలుగా గోడమీద తిరుగుతుంది. పీడ కనిపిస్తోంది కాని పురుగు మటుకు కనిపించడం లేదు.

'కొంపదీసి ఏ దయ్యమో వచ్చి ఈ ఆకారంలో తిరగడం లేదుగదా,' అని పార్వతి మనసులో అనుమానం మొదలై క్షణాల మీద కొండంత పెరిగింది. తన అనుమానం వణుకుతున్న గొంతుకతో నెమ్మదిగా రామ్మూర్తికి చెప్పింది. స్వతహాగా రామ్మూర్తికి దయ్యాలూ భూతాలూ అంటే నమ్మకం లేదు. ఎవరయినా అలాంటి మాటలు మాట్లాడినా తేలిగ్గా కొట్టి పారేసే వాడు. అయితే ఇప్పుడు అతనికి అంతా తికమకగా వుంది. గోడ మీద పడిన పీడ మరీ చిన్నదేం కాదు. చిన్నసైజు పక్షి అంత ఉంది. పీడ పైకప్పు మీద గోడల మీద తిరిగినప్పుడు పురుగు కనిపించక పోయినా నేలమీదకి ఆ పీడ తిరిగినప్పుడయినా కనిపించాలి కదా ఏదో ఒక ఆకారం. ఆలోచించిన కొద్దీ రామ్మూర్తికి కూడా పార్వతి అనుమానం నిజమే ననిపించింది. అతనికి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించినట్లయింది. "పోనీ పక్కింటి అనసూయ వదిన్ని లేపమంటారేంటండీ" అంది రామ్మూర్తితో భయంగా. "వద్దులే. ఈ అర్థ రాత్రిపూట అందరినీ ఎందుకు కంగారు పెట్టడం." అన్నాడు రామ్మూర్తి అయిష్టంగా.

"అయితే మనం హాలులో పడుకుందాంబాబూ. లేకుంటే నాకు భయంతోటి అసలు నిద్రపట్టదు." అంది. "సర్లే! అయితే నడు" అంటూ రామ్మూర్తి నానిని తీసుకుని భుజం మీద వేసుకున్నాడు. పార్వతి గబగబా రెండు దుప్పట్లు రెండు తలగడాలు తీసుకొని హాలులోకి నడిచింది.

*

పొద్దున్న లేస్తూనే పక్కింటి అనసూయతో రాత్రి జరిగిన సంగతంతా వివరంగా చెప్పింది పార్వతి. అనసూయ ఆశ్చర్యపోయి భర్త శంకర్రావుతో చెప్పింది. అనసూయ, శంకర్రావు నానిగాడ్ని చూసారు, వాడు వడిలిపోయిన తోటకూర కాడలా పడి వున్నాడు. జ్వరం తీవ్రంగా వుందనడానికి గుర్తుగా మొహం కొంచెం ఎర్రగా ఉంది. వుండుండి ఉలిక్కి పడుతున్నాడు.

అనసూయ వాడి కేసి పరీక్షగా చూసి "సందేహంలేదు; గాలిచేష్టలే" అంది. ఆ మాటతో పార్వతి మరింత బెదిరిపోయింది. రామ్మూర్తి రోమాలు నిక్కపొడుచు కొన్నట్లు అయ్యాయి.

శంకర్రావు ఎటూ చెప్పకుండా ఆలోచిస్తూ వూరుకున్నాడు. అతను పల్లెటూరులో పుట్టి

పెరినందువల్ల అతనికి దయ్యాలంటే నమ్మకం కొంచెం ఎక్కువగానే వుంది. ఆ రాత్రి శంకర్రావు రామ్మూర్తి వాళ్ళింట్లోనే పడుకుని ఆ వ్యవహార మేమిటో తేల్చాలనుకొన్నాడు. అనసూయ ఇంట్లోకి పోయి కుంకుమ తెచ్చి మంత్రించి నాని నుదుటని పెట్టింది. రామ్మూర్తి నానిని డాక్టరు దగ్గరికి తీసుకువెళదామనుకొన్నాడు కాని అనసూయ, శంకర్రావు అసలు ఒప్పుకోలేదు. ఇలాంటి వాటికి డాక్టరేం చెయ్యగలడన్నారు. ఆ రాత్రి కూడా ఆ నీడ కనిపిస్తే మర్నాడు భూత వైద్యుడి దగ్గరకు తీసుకుపోవచ్చు లెమ్మన్నాడు శంకర్రావు. రామ్మూర్తికి కూడా అదే సరి అయిన పద్ధతిగా అనిపించి వూరుకున్నాడు.

రాత్రి సరిగ్గా నిద్రలేని కారణంగా రామ్మూర్తికి కూడా కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తల దిమ్ముగా ఉన్నట్లు అనిపించి ఆఫీసుకి సెలవు చీటీ పంపించాడు. రాత్రి అవుతున్నకొద్దీ పార్వతికి భయంతో గుండెలు దడదడ లాంటివి మొదలు పెట్టాయి. హనుమాన్ చాలిసా చదువుతూ కూర్చుంది. అనసూయ మళ్ళీ కుంకుమ మంత్రించి నాని మొహాన పెట్టింది. వాడు మటుకు మూసిన కన్ను తెరవకుండా పడి వున్నాడు. ఎందుకయినా మంచిదని శంకర్రావు ఆంజనేయ స్వామి కోవెలకి వెళ్ళి సింధూరం తెచ్చి అందరి మొహాన బొట్లు పెట్టాడు.

రాత్రి అయ్యింది. పార్వతి నానిని పెట్టుకొని హాలులో పడుకుంది. రామ్మూర్తి, శంకర్రావు భోజనాలు చేసి మాట్లాడుకొంటూ కూర్చున్నారు. 10 గంటలు అయ్యాక బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి పడుకున్నారు. శంకర్రావు ఆ నీడ ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూస్తున్నాడు. గంటసేపు గడిచినా ఏమీ రాకపోయేసరికి భార్యాభర్తలు ఏదో భ్రమపడి వుంటారనుకుని కళ్ళు మూసుకొన్నాడు. శంకర్రావు చేతిమీద చెమ్మదిగా తట్టి "అదిగో చూడండి గోడ మీద" అన్నాడు రామ్మూర్తి. చటుక్కున కళ్ళు విప్పి లేచి కూర్చున్నాడు శంకర్రావు. చిన్న సైజు గబ్బిలం అంత నీడ గదిలో గోడమీద తిరుగుతోంది. వలయాలుగా తిరుగుతోంది. సర్రున నేల మీదకి దూసుకువచ్చి మళ్ళీ వెంటనే గోడల మీదకి పోతోంది. శంకర్రావు నెమ్మదిగా స్విచ్ ఆన్ చేశాడు. పరీక్షగా గది అంతా చూశాడు. రామ్మూర్తి చెప్పినట్లు ఎక్కడా ఏమీ కనపడలేదు. పెట్టెల సందునా, తలుపుల వెనకా జాగ్రత్తగా వెదికాడు. ఏమీ కనిపించక పోయేసరికి అతనికి కూడా ఆశ్చర్య మనిపించింది. "మరోసారి చూద్దాం వుండండి" అంటూ ట్యూబ్‌లైటు ఆర్పి వెళ్ళి మంచంమీద కూచున్నాడు. రామ్మూర్తి అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాడు నిశ్శబ్దంగా. ఐదు నిముషాలు తర్వాత మళ్ళీ తిరగడం మొదలు పెట్టింది నీడ. శంకర్రావు నెమ్మదిగా లేచి అలమారులో వున్న బ్యాట్రీ లైటు అందుకుని ఆ నీడ తిరుగుతున్న చోట వేసాడు. నీడే తప్ప ఆకారం ఏమీ కనిపించలేదు. నీడ ఎక్కడ తిరిగితే లైటు అటు తిప్పి చూసాడు. ఎన్నివిధాలుగా పరీక్షించినా ఏమీ కనపడ లేదు.

"విచిత్రంగా వుందే! నీడ కనిపిస్తోంది కాని ఆకారం కనిపించడం లేదు" అన్నాడు రామ్మూర్తితో.

"అదే కదా వచ్చిన గొడవ" అన్నాడు రామ్మూర్తి, లేచి ట్యూబ్‌లైటు వేసాడు. నీడ అదృశ్యమయింది. అసలు విచిత్ర మేమిటంటే పెద్దలైటు వేస్తే ఏమీ కనపడడం లేదు. అన్నాడు శంకర్రావుతో. శంకర్రావు రెండు నిముషాలు దీర్ఘంగా ఆలోచించి "సందేహం లేదు గాలిచేష్టలే" అన్నాడు. రామ్మూర్తికి వెన్నులోంచి భయం జరజరా పాకింది. మరింక ఆలస్యం చెయ్యకుండా ఇద్దరూ బయటికి వచ్చి తలుపు గొళ్ళెం పెట్టేసారు.

"కనిపించిందా" అంది పార్వతి వీళ్ళిద్దరినీ చూసి లేచి కూర్చుంటూ. అంతవరకూ ఆవిడసలు నిద్రపోలేదని ఆవిడ మొహం చూస్తేనే తెలుస్తోంది. "కనిపించింది," అంటూ రామ్మూర్తి వెళ్ళి నాని పక్కన కూర్చున్నాడు. "ఏమిటంటారు, అన్నయ్యగారూ?" అంది శంకర్రావు కేసి పార్వతి ప్రశ్నార్థకంగా చూస్తూ. "అనేందుకేముందమ్మా! గాలిచేష్ట అని స్పష్టంగా తెలిసిపోతుంటేనూ" అన్నాడు శంకర్రావు అక్కడే ఉన్న పడక కుర్చీలో కూర్చుంటూ. "ట్యూబ్‌లైటు వేసినప్పుడు ఆ నీడ కనిపించలేదని మీరు ఎప్పుడయితే అన్నారో నాకు అప్పుడే అనుమానం వేసింది. ఎందుకంటే దయ్యాలు ఎప్పుడూ చీకటిలోను, తక్కువ వెలుతురు ఉన్నచోట ఉంటాయి. ఆ విషయం నిర్ధారణ అయ్యిందికదా" అన్నాడు శంకర్రావు. పార్వతి కొంగు నోటికి అడ్డు పెట్టుకొని ఏడవడం మొదలుపెట్టింది.

"ఏడవకమ్మా! ఏం చేస్తాం; మన నుదుటని ఎన్ని బాధలు పడమని రాసాడో ఆ బ్రహ్మదేవుడు తప్పుతుందా మరి. రేపు తెల్లవారు తూనే పిల్లాడ్ని మంచి భూత వైద్యుడి దగ్గిరకు తీసుకెళ్దాం" అంటూ శంకర్రావు పార్వతిని ఓదార్చుతూ అన్నాడు.

మర్నాడు రామ్మూర్తితో పాటు శంకర్రావు కూడా ఆఫీసుకి సెలవు పెట్టేసాడు. మంచి భూత వైద్యుడు ఎక్కడున్నాడు? అని వాకబు చెయ్యడంతో ఆ దారిలో వాళ్ళందరికీ అసలు సంగతి తెలిసిపోయింది. అంతా భయపడి వారి పిల్లల్ని రామ్మూర్తి ఇంటివేపు రాకుండా కట్టుదిట్టం చేసారు. సాయంత్ర మయ్యేసరికి ఆంజనేయ స్వామి దండకం చదువుకొని ఆంజనేయ స్వామి బొట్టు పెట్టుకొంటున్నారు.

[ముగింపు వచ్చే సంచికలో]



స్వీయపరిచయం

"నేను 9వ తరగతి వరకు మాత్రం చదివాను. నాకు ముగ్గురు ఆడపిల్లలు. నా భర్త ఏడాది క్రితం 'హార్టు ఎటాక్'తో పోయారు. నా కథలో నానిలాగే నేను కూడా నా జీవితాన్ని చూసి 'రజ్జు సర్పభ్రాంతి' అని తేలికగా అనుకునే రోజు కోసం ఎదురు చూస్తూ ప్రయత్నాలు చేస్తున్నాను."

—కొఠా జయప్రద